దైవసేవ చేయుచు, తమ్ము ఆశ్రయించియున్న వారికి, తల్లిదండ్రాదులకును సేవచేయక కష్టములపాలు చేయుట పుణ్యములో పాపమే యగును.

ఒక భక్తుడు సప్తాహము చేయదలంచి ధనవంతుల నడిగి వేలకొలది ధనమును, బియ్యమును, కందిపప్పు మొదలగు పప్పు పదార్థములను, కూరగాయలను ప్రోగుచేసి సప్తాహ కార్యక్రమమును ప్రారంభించి జరుపుచు లోభగుణముతో సరిగా ధనాదివస్తువులను ఖర్చుపెట్టక కార్యక్రమమును పూర్తిచేసెను. తరువాత మిగిలియున్న ధనముతో తన కున్న ఋణములను తీర్చెను. బియ్యము, పప్పులు మొదలగు వాటిని తన కొడుకులకు, కొమార్తెలకు నిచ్చెను.

ఇదియు పుణ్యములో పాపమే గదా! పేదలకుగాని, వృద్ధులకుగాని, భక్తులకుగాని, సాధువులకుగాని సేవచేసి, భోజనము పెట్టి, ధనమునిచ్చి వారికి బాధ కలుగునట్లు వర్తించినను, మాటలు మాట్లాడినను పుణ్యములో పాపమే యగును.

## 29. స్త్రీ జన్మ విశిష్టత

"కీర్తిశ్శ్రీ ర్వాక్చ నారీణాం స్మృతి ర్మేధా ధృతిః క్షమా"

అని గీత దశమాధ్యాయములో చెప్పబడినది. అనగా స్త్రీలలో గల కీర్తి (శ్రీ)వాక్కులో గల మృదుత్వము, జ్ఞాపకశక్తి, మేధస్సు ( తెలివితేటలు ), ధైర్యము, ఓర్పు—ఇవి భగవంతుడ నగు నా విభూతులు అని భగవంతుడు చెప్పెను. కనుక పురుషులలోకంటె స్త్రీలలోనే గొప్ప గుణములు గలవని తెలియుచున్నదిగదా. స్త్రీలు అహింసా స్వరూపులని గాంధీమహాత్ముడు చెప్పెను. పురుషులలో కఠినస్వభావ మెక్కువగా నుండును. స్త్రీలలో మెత్తని

స్వభావము, దయారసగుణము, కరుణాస్వభావము లెక్కువగా నుండును.

శివుని భోలాశంకరు డని చెప్పుదురు. అనగా కొలది కాలము స్తుతించినంత మాత్రమున అనుగ్రహము ( దయ ) చూపువాడని తాత్పర్యము. స్త్రీలలోకూడ భోలాస్వభావము గలవా రెక్కువగా కనబడుచుందురు. పురుషులలో స్త్రీల స్వభావము గలవారు కలరు. స్త్రీలలో పురుషుల స్వభావము గలవారున్ను కలరు. మెత్తని స్వభావము గలవారలలో పనేకులు అవినీతి ( చెడు ) వర్తనలకు లోబడుచుందురు. సత్యధర్మములపై అచంచల పట్టుదలగలవారు మాత్రమే ఇతరులు అవినీతి వర్తనలకు లొంగదీయుటకు ప్రయత్నించినను లోబడరు. అహంకారమున్నంతవరకు మానవునకు అశాశ్వత సుఖములపై భ్రాంతు లుండును.

ప్రశ్న : స్వామీ! మీరు స్త్రీలను విశేషముగా పొగడెద రేల? స్త్రీలు అబలులని, అసమర్థులని, చంచలు రని, పురుషులకంటె స్త్రీలకు ఎనిమిది రెట్లు కామ ముండుననియు చదివియుంటిని. మఱియు శంకరాచార్యులవారు స్త్రీ శరీరమును నీచమైనదిగా, సర్వవేదాంత సిద్ధాంత సంగ్రహమున వర్ణించిరి. ప్రశ్నోత్తర మణి రత్నమాలలోకూడ స్త్రీలు నరకద్వారములనియు, కల్లువలె మోహింపజేయునది స్త్రీ యనియు, జీవులకు సంకెళ్లు స్త్రీ యనియు, స్త్రీపిశాచముచే వంచింపబడనివాడే జ్ఞాని యనియు చెప్పిరి.

శ్లో. కులీనా రూపవత్యశ్చ నాథవత్యశ్చ యోషితః
మర్యాదాసు న తిష్ఠంతి స దోషః స్త్రీషు గరీయాన్ ॥

తా. స్త్రీలు మంచికులమునందు పుట్టినను, రూప
వతులైనను, భర్తగలవారైనను నియమము కలిగి
ండరు. ఇదియే స్త్రీలలో గల పెద్ద దోషము.

అనృతం సాహసం మాయా దాక్షిణ్యం చలచిత్తనం
రోదనం అపవాదం చ సప్తైతే స్త్రీస్వభావికమ్ ॥

తా. (1) అబద్ధమాడుట (2) నేను చేసెద నని సాహ
సి చూపుట (3) విపరీత భ్రమలు చేయుట (4) దయా
ము కలిగియుండుట (5) చిత్తచాంచల్యము కలిగి
ండుట (6) సామాన్యవిషయములకు దుఃఖపడుట (7) లేని
దోషములను ఆరోపణచేసికొనుట—ఈ ఏడున్ను
లకు స్వభావముగా నుండును. (శివపురాణము)

సీ. దయమాలి ప్రియుతోడ దప్పు జేసియు నబ
ద్ధమ్ము లాడుట యాడుదాని సొమ్ము
ప్రాణమ్మునకు గడ్డిపరకంత వెలయైన
దలపకుండుట యాడుదాని సొమ్ము
అత్యంత లోభమ్ము నంది యూరక మౌర్ఖ్య
మూనియుండుట యాడుదాని సొమ్ము
అవమానమునకు లోనై దురాచార ప
ద్ధతి వహించుట యాడుదాని సొమ్ము

గీ. కష్టసంసారమునకు లోగా నొనర్చి
దాటనీకుండు టది యాడుదాని సొమ్ము
లేనిపోని విలాసమ్ము లూని మోక్ష
దశను జెడగొట్టు టది యాడుదాని సొమ్ము.
(దేవీభాగవతము)

ఈవిధముగా స్త్రీలలో అనేక దోషము లుండగా
లను మీరు స్తుతించుట యనునది నా కాశ్చర్యము

గలిగించుచున్నది. స్త్రీలలో గొప్పతన మున్నచో ప్రమాణములతో తెలియజేసినచో నేను నమ్మగలను. స్త్రీలను విమర్శించితి నని మీరు నాపై కోపము చూపకుందురుగాక యని కోరుచున్నాను.

జవాబు : సోదరా! స్త్రీలను విమర్శించుట, దూషించుటయును మహాపాపము. స్త్రీలలోగాని, పురుషులలోగాని గల చెడును మాత్రమే దూషించి దూరముగా నుండవలెను.

స్త్రీలలో (1) పద్మినిజాతి (2) హస్తినిజాతి (3) చిత్రిణిజాతి (4) శంఖినిజాతి యని నాలుగు జాతుల వారు కలరు. ఇట్లే,

పురుషులలో (1) భద్రుడు (2) దత్తుడు (3) కూచిమారుడు (4) పాంచాలుడు అను నాలుగు తరగతులవారు కలరు అని శాస్త్రము చెప్పెను.

కామ మనెడి దుర్గుణమును నశింప జేసికొనుటకే స్త్రీ శరీరమును నీచముగా శంకరాచార్యులవారు వర్ణించిరి. ఇట్లే స్త్రీలుకూడ పురుషుల శరీరమును నీచమైనదిగా వర్ణించుకొని విరక్తి నొందవలెను. పురుషులకు స్త్రీ నరకద్వారమైతే, స్త్రీలకు పురుషులు నరకద్వారముకాదా? ఇచట స్త్రీలకైనను,పురుషులకైనను కామమే నరకద్వారమని గ్రహించవలెను. స్త్రీలకంటె పురుషులకే ఎనిమిది రెట్లు కామము కనబడుచున్నది. పురుషునికంటె స్త్రీ గొప్పదగుటచేతనే స్త్రీనామము మొదట పిలువబడుచున్నది. ఎట్లన తల్లి దండ్రి, లక్ష్మీ నారాయణ, పార్వతీ పరమేశ్వరులు, సీతా రాములు, భార్యా భర్త, స్త్రీ పురుషులు.

శంకరాచార్యులకు స్త్రీపై గౌరవ ముండుటవలననే తమ పీఠమునకు శారదాపీఠ మని పేరు పెట్టుకొనెను.

స్త్రీలలోను, పురుషులలోను ఉత్తములు, మధ్యములు, అధములు, అధమాధములు యను నాలుగు తరగతులుగా నుందురు. సుకృతవిశేష మున్నచో అధమాధమ స్థితి నుండి పరిణామము జెంది ఉత్తమోత్తమ స్థితికి రాగల్గుదురు. లోకములో మంచివారు చెడ్డవారుగా మార్పుజెందుట చూచుచున్నాము. చెడ్డవారు మంచివారుగా మార్పుజెందుట చూచుచున్నాముగదా! స్త్రీలందరున్ను అపవిత్రులని, అసమర్థులనియు తలంచరాదు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు దేవీ యాజ్ఞప్రకారము నడచుకొనుచున్నారని చరిత్రలో కలదు.

అనసూయ త్రిమూర్తులను పసిబాలురను చేసినట్లు చరిత్రకలదు. అనసూయ, అరుంధతీ దేవులను త్రిమూర్తులు, లక్ష్మి, పార్వతి, సరస్వతులున్ను గౌరవించినట్లు చరిత్ర కలదు.

సుమతి సూర్యుని ఉదయించకుండ చేసినట్లు చరిత్ర కలదు. సావిత్రి యమధర్మరాజుతో వాదించి చనిపోయిన తన భర్తను బ్రతికించుకొనినట్లును చరిత్ర కలదు.

రావణాసురుని భార్యయగు మండోదరి, విభీషణుని భార్యయైన సరమ, రావణుని కోడలగు సులోచనయు ఉత్తమ స్త్రీ లని పొగడబడిరి. స్త్రీలు అబలులు, అసమర్థులునైనచో శిక్షించే శక్తి, రక్షించే శక్తియు నుండదుగదా! కేకయ రాజు మందరయొక్క అల్లుని చంపుటవలన క్రోధము నుంచుకొని, కేకయరాజుయొక్క అల్లుడగు దశరథమహారాజును చంపించెను. భీష్మాచార్యులవారు తన్ను అన్యాయముచేసెనని అంబ క్రోధము నుంచుకొని శిఖండిగా బుట్టి భీష్ముని చంపించెను.

గంగాదేవి, జ్వాలాదేవియు అర్జునునిపై క్రోధము గలవారై చచ్చునట్లు శపించిరి. అందువలన అర్జునుని కుమారుడగు బభ్రువాహనుడు అర్జునుని శిరస్సును ఖండించి రహస్యముగా శిరస్సును దాచెను. తరువాత శ్రీకృష్ణ భగవానుడు తన ప్రభావముచే శిరమును రప్పించి అర్జునుని బ్రతికించెను. ఈ కథ విపులముగా జైమినీభారతములో గలదు.

సులభ, గార్గి, మైత్రేయి, మదాలస, చూడాల మొదలగు మహాతల్లులు బ్రహ్మజ్ఞాన సంపన్నులని చరిత్రలు చెప్పుచున్నవి. అజ్ఞానిగాయున్న శిఖధ్వజమహారాజును భార్య యగు చూడాల జ్ఞానవంతునిగాచేసి రాజ్యపరిపాలన చేయించెను. అజ్ఞానిగాయున్న లీలాశుకునకు చింతామణి జ్ఞానబోధచేసి పరమభక్తునిగా, గ్రంథకర్తనుగా జేసెను. తులసీదాసునకు తన భార్యయే వైరాగ్యమును బోధించి మహాభక్తునిగా జేసెను. తరిగొండ వేంకమాంబ తరిమెల గ్రామమున పుట్టి పరమభక్తురాలై కొన్ని మహిమలనుకూడ చూపి తరువాత తిరుపతి క్షేత్రమునకు చేరి శ్రీ వేంకటేశ్వర స్వామియొక్క అంతరంగభక్తురాలై తపస్సుచేసి జ్ఞానవంతురాలై అనేకమందిని సన్మార్గమున నడిపించుచు, అనేక సద్గ్రంథములను వ్రాసి మహాత్మురాలని ప్రసిద్ధికెక్కెనుగదా! శ్రీ రామకృష్ణపరమహంసగారికి భైరవ బ్రాహ్మణి యను స్త్రీ మొదటి గురువుగానుండెను. శ్రీ మెహర్ బాబాగారికి, హాజరతుబాబాజాను అను స్త్రీ మొదటి గురు వయ్యెను. శ్రీ బుద్ధదేవుడు ఆహారమును మాని తపస్సుచేయుచు నీరసించి మృత్యువాత బడబోవునపుడు స్త్రీలే జీవనధర్మమును తెలిపి ఆహారమునుపెట్టి రక్షించిరి. విశాఖాదేవి యను

ప్రధాన శిష్యురాలు బుద్ధుని, వాని సంఘమును చాలాకాలము పోషించెను. శ్రీ రామకృష్ణపరమహంసగారిని రాణీరాసమణి పోషించెను. శ్రీ రమణమహర్షులవారిని మొదటి నుండియు స్త్రీలే పోషించుచువచ్చిరి. మొదలియార్ పాటికి యను భక్తురాలు నలుబదిసంవత్సరములు ఆహారమును పెట్టినది. స్త్రీల సహాయమువలననే శ్రీ గాంధీ, శ్రీ అరవింద యోగి, శ్రీ మలయాళస్వాములవారు, శ్రీ ఓంకారస్వాముల వారు మొదలగు మహాత్ముల ఆశ్రమములు అభివృద్ధికివచ్చి పోషింపబడుచున్నవి.

భక్తవిజయమను గ్రంథములో మీరాబాయి, సక్కుబాయి, గోమాబాయి, కర్మాబాయి, జనాబాయి, ప్రేమాబాయి, రామాబాయి, పిళాబాయి, గుణవతీబాయి, కుపరాబాయి, శీలాబాయి, కస్తూరిబాయి, కృష్ణాబాయి, కారక్కాలమ్మ, భక్తిమతి, నిర్మల, కన్హోపాత్ర, శబరి మొదలగు మహాతల్లుల చరిత్రలను చదువుచున్నాముగదా!

స్త్రీలుకూడా రాజ్యపరిపాలన చేయుట కలదు. శిఖధ్వజమహారాజు వైరాగ్యముతో అరణ్యమునకు పోయి నివసించినపుడు భార్యయగు చూడాలయే రాజ్యపరిపాలన చేసెను. మనకు స్వరాజ్యము రాకపూర్వము ఇంగ్లాండు దేశపు రాణీగారే మన దేశమును పరిపాలించెనుగదా! సింహళదేశమున స్త్రీయే మంత్రిపదవి నలంకరించెను. మన దేశమునం దిపుడు శ్రీమతి ఇందిరాగాంధి ప్రధానమంత్రి పదవి నలంకరించి పరిపాలించుచున్నారుగదా!

పురుషులు స్త్రీలను దూషించుచున్నచో, తిరస్కరించుచున్నచో స్త్రీ సహాయము లభించక పురుషుడు బాధ పడవలసివచ్చును. ఇట్లే స్త్రీలు పురుషులను దూషించి

నను, తిరస్కరించినను పురుషుని అండ లభించక స్త్రీలు బాధలు నొందవలసివచ్చును.

శ్లో. అసారభూతే సంసారే సారభూతా నితంబినీ
ఇతి సంచింత్యవై శంభుః అర్ధాంగే కామినీం దధౌ॥

తా. అసారమైన ఈ లోకమందు సారమైనది స్త్రీయే. ఇది తెలిసియే కాబోలు శివుడు తన అర్ధశరీరమున స్త్రీని ధరించినాడు.

శ్లో. యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః
యత్రైతాస్తు నపూజ్యంతే సర్వాస్తత్రాఽఫలాః క్రియాః.

తా. స్త్రీలు పూజింపబడుచున్న స్థలముననే దేవతలు తిరుగుదురు. స్త్రీలకు గౌరవము యీయబడని తావులందు జరుగు సర్వక్రియలును నిష్ఫలములే. (మనువు)

## నే నెవరిని ?

మంచిపనులను చేయుచున్నంతవరకును నీవు సజ్జనుడవు.

చెడ్డపనులను చేయుచున్నపుడు నీవు దుష్టుడవు.

కనబడే రూపములపై, వినబడే శబ్దములపై, పనులపైని ఆసక్తి, ద్వేషభావము లున్నంతవరకు నీవు సంసారివి.

నామ రూప క్రియలపై రాగద్వేషములు నశించినపుడు నీవు సన్న్యాసివి.

సర్వమును దేవునిగా నిశ్చయించి అన్నిపనులను దైవార్పణము చేయుచు సర్వదా దేవుని స్మరించుచున్నంత వరకు నీవు భక్తుడవు.

నీలో కామ మున్నపుడు కామమే నీవు. క్రోధ మున్నపుడు క్రోధమే నీవు. భయ మున్నపుడు భయమే నీవు. అహంకార మున్నపుడు అహమే నీవు. మమకార మున్నపుడు